క్లుప్తంగా

పట్టణాభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్

జగిత్యాల: పట్టణాభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతున్నామని, గతంలో కంటే జగిత్యాల మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ఉందని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. 32 ఎజెండా అంశాలను కౌన్సిల్ ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి కార్మికులకు యూనిఫామ్, సబ్బులు, నూనె, చెప్పులు, చీపుర్లు కొనుగోలు చేయడం, మోచిబజార్ శ్మశాన వాటికలో నీటి సరఫరా సమకూర్చడం, అలాగే టౌన్‌హాల్ నుంచి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వరకు పైప్‌లైన్ వేస్తున్నట్లు వివరించారు. త్వరలో జరిగే బీరయ్య జాతర ఉత్సవాల ఏర్పాటుకు, వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో వాకింగ్ ట్రాక్ వద్ద చిలుకవాడ, తహసీల్దార్ ఆఫీసు వద్ద తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసేందుకు రూ.80లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, ఇంజనీర్లు శరణ్‌తేజ, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కెడెట్స్ కళాశాలకే గర్వకారణం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: ఎన్‌సీసీ కెడెట్స్ 19 బెటాలియన్‌లో ప్రత్యేక గుర్తింపు సాధించారని ట్రెక్కింగ్, ఫైర్ షూటింగ్‌లో కూడా ప్రత్యేకత చాటారని, బీ సర్టిఫికెట్‌లో వందశాతం రిజల్ట్స్ సాధించి కళాశాలకే గర్వకారణంగా నిలిచారని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కొనియాడారు. ఈ మేరకు శనివారం కళాశాలలో కెడెట్స్‌ను ఆయన అభినందించారు. ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఎల్జిబెత్‌రాణి, అధ్యాపకులు రవికుమార్, గోవర్ధన్, అశోక్, రాజేశం పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి 108 రకాల నైవేద్యాలు



నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

రాయికల్: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 73వ గీతాయజ్ఞ కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకృష్ణునికి భక్తులు 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం భగవద్గీత గురించి గీత ప్రబోధ చిలమంతుల చక్రవర్తి వివరించారు. అధ్యక్షుడు చింత శివకుమార్, జనరల్ సెక్రటరీ వెంకటరమణ, కోశాధికారి జనార్దన్, ఆంజనేయులు, ప్రభు, వెంకటరమణ, శేఖర్, నవీన్, సురేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అశ్విని

రాయికల్: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ జాదవ్ అశ్విని అన్నారు. ఈ మేరకు శనివారం అల్లీపూర్ సహకార సంఘం పరిధిలో అల్లీపూర్, సింగరావుపేట, శ్రీరాంనగర్, భూపతిపూర్ సహకార సంఘం పరిధిలో ఒడ్డెలింగాపూర్, బోర్నపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, ఏనుగు ముత్యంరెడ్డి, సర్పంచ్‌లు పాలకుర్తి రవి, పాదం లత, అత్తినేని గంగారెడ్డి, రాంచందర్‌రావు, రాజమౌళి, ఎంపీటీసీలు మోర విజయలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మేకలు మృతి



కొడిమ్యాల: మండలంలోని నల్లగొండలో విద్యుత్ షాక్‌తో శనివారం నాలుగు మేకలు మృతిచెందాయి. తెగిపడిన విద్యుత్ వైర్లు తాకడంతో గ్రామానికి చెందిన కోలపురి రాజయ్య, మెట్ట దుర్గయ్యకు చెందిన 4 మేకలు చనిపోయాయి. పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

సండే స్పెషల్

సమాజసేవలో టీవీ రాజశేఖర్

- వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత
- రూ.6లక్షల విలువైన వైకుంఠరథం అందజేత
- ఉచితంగా నీటి సరఫరా
- కరోనా కాలంలో రెండేళ్లపాటు పేదలకు అన్నదానం

కోరుట్లటౌన్: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్నా.. అన్నట్లు పట్టణంలోని ప్రకాశం రోడ్ కాలనీకి చెందిన దాసరి రాజశేఖర్ అలియాస్ టీవీ రాజశేఖర్ పేదలకు సేవలు అందిస్తూ తనదైన గుర్తింపు పొందాడు. పదేళ్లుగా సాయం కోసం ఎదురుచూసే వాళ్లకు మానవతా దృక్పథంతో సేవలు చేస్తున్నాడు. దాసరి రాజశేఖర్ టీవీ షాపు పెట్టి ఇరవై ఏళ్లు వినియోగదారుల మన్ననలు పొందాడు. ఈ క్రమంలోనే దాసరి రాజశేఖర్ అలియాస్ టీవీ రాజశేఖర్‌గా పేరు పొందాడు.



అలయన్స్ క్లబ్‌కు వైకుంఠరథం అందజేస్తున్న రాజశేఖర్-సునీత దంపతులు



నిత్యావసరాలు అందజేస్తున్న శేఖర్

రూ.6లక్షలతో వైకుంఠరథం ఏర్పాటు

రాజశేఖర్ తన తల్లిదండ్రులైన దాసరి లింగుబాయి-కిషన్ జ్ఞాపకార్థం అలయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల వాగ్దేవి (మహిళా క్లబ్)ఆధ్వర్యంలో హిందూ దహన సంస్కారంలో భాగంగా వినియోగించే వైకుంఠరథం ఏర్పాటు చేసి ఉచితంగా సేవలు అందిస్తున్నారు.

వాటర్ ట్యాంక్‌తో నీటి సరఫరా

పట్టణంలో తాగునీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు రూ.2లక్షలతో నీళ్ల వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా నీటి సరఫరా చేస్తున్నాడు. పట్టణంలో నీటి ఇబ్బందులు పడుతున్న విషయం తెలపగానే నీళ్ల వాటర్ ట్యాంకర్ పంపి, సేవలు అందిస్తున్నాడు.

వరదలు, కరోనా సమయంలో సేవలు..

పట్టణంలోని వరదలతో కాలనీలు జలమయమైనప్పుడు టీవీ రాజశేఖర్-సునీత దంపతులు పేదలకు సాయం చేశారు. వానాకాలం రోడ్లు మునిగి, బయటకు రాని వారికి జేసీబీ సాయంతో వారందరికీ నిత్యావసర సరుకులు, ఉచితంగా భోజనం అందజేశారు. కరోనా సమయంలో మున్సిపల్ సిబ్బందికి ఉచితంగా 100 మందికి పీపీఈ కిట్లు అందజేశారు. కరోనా కాలంలో రెండేళ్లపాటు కరోనా బాధితులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



టీవీ శేఖర్ అందించిన వాటర్ ట్యాంకర్

“ పేదలకు సేవ చేయడమే లక్ష్యం

నిరుపేదలకు సేవ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాను. ఆపదలో ఉన్నవారికి వీలైనంత సాయం చేయడం తృప్తినిపిస్తుంది. ఇకముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాను.

– దాసరి రాజశేఖర్ అలియాస్ టీవీ రాజశేఖర్, కోరుట్ల

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానం

సారంగాపూర్: నాలుగేళ్ల ప్రొహిబిషన్ పూర్తి చేసిన గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు వారి డిమాండ్లకు అనుగుణంగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సభ్యులు డిమాండ్ చేయగా, బీర్‌పూర్ మండలం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కాగా శనివారం బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని 15 గ్రామాల సర్పంచ్‌లు చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని నిరసన తెలుపుతూ.. సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు అందేలా చూడాలని, ప్రతి గ్రామంలో మూడు, నాలుగు నెలల నుంచి సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామపంచాయతీల నుంచి ప్రతినెలా విద్యుత్ బిల్లులు, ఇతర చెల్లింపులు జరుపుతున్నారని సిబ్బందికి వచ్చేసరికి కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. ఎంపీపీ మాట్లాడుతు కార్యదర్శుల ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని కోరుతూ తీర్మానం ప్రతిపాదించగా, కొల్వాయి, తుంగూర్ గ్రామాల ఎంపీటీసీలు రంగు లక్ష్మణ్, ఆడెపు మల్లీశ్వరి బలపరచడంతో సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. నర్సింహులపల్లె ఎంపీటీసీ ఎడ్ల సృజన మాట్లాడుతూ నర్సింహులపల్లెలో మిషన్ భగీరథ నీరు అందకపోవడంతో ప్రజలు నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ఈ వేసవికి కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు తాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల నుంచి ఉపాధి నిమిత్తం గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లిన వారి పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగిస్తున్నారని, వారు స్వగ్రామానికి తిరిగి చేరుకున్న తర్వాత రేషన్‌కార్డులో తమ పేరు చేర్చాలని కోరినా పేర్లు కార్డులో చేర్చకపోవడంతో జీవనోపాధి కోసం వెళ్లి వచ్చిన తర్వాత తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని కోరారు. గోదావరి తీరం వెంబడి వర్షాలకు కొట్టుకుపోయిన ఎత్తిపోతల పథకాల మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలని విండో చైర్మన్ నవీన్‌రావు కోరారు. సభ్యుల ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానం ఇచ్చారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీడీవో మల్లారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్

కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మె

కోరుట్లరూరల్: రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ పిలుపు మేరకు మండలంలో పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. రెండోరోజు శనివారం కార్యదర్శులు విధులు బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మెలో పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగింది.

రాయికల్‌లో..

రాయికల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేయాలని కోరారు. జేపీఎస్‌లు నరేశ్, కవిత, వెంకటేశ్, రాజేశ్, మహేశ్, గీతారాణి, అపర్ణ, నవ్య, దేవదాసు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: సమ్మెలో పాల్గొన్న కార్యదర్శులు

కథలాపూర్: తమను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ కథలాపూర్‌లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె శనివారం రెండోరోజు కొనసాగింది. వీరికి సర్పంచుల ఫోరం తరుపున రూ. 5 వేలు ఆర్థికసాయం అందించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

వందశాతం ఇంకుడుగుంతలు నిర్మించాలి



మాట్లాడుతున్న బాలె శివాజీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఇంకుడుగుంతల నిర్మాణంలో పైలెట్ ప్రాజెక్టుగా ఇబ్రహీంపట్నం, కొజన్‌కొత్తూర్, వేములకుర్తి గ్రామాలను గుర్తించగా ఈ గ్రామాల్లో ఇంటింటికీ వందశాతం ఇంకుడు గుంతలను నిర్మించాలని కోరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 15వరకు ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. 3 గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించామని ఇబ్రహీంపట్నంకు ఏపీఎం శంకర్, వేములకుర్తికి ఎంపీడీవో ప్రభు, కొజన్‌కొత్తూర్‌కు ఇన్‌చార్జ్ ఏపీవో వినోద్‌కుమార్ నియమించినట్లు తెలిపారు. ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, ఇన్‌చార్జి ఏపీవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ మున్సిపల్‌లో విచారణ చేపట్టాలి

జగిత్యాల: మున్సిపల్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరుతూ 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించిన ఎజెండాలో తప్పులున్నాయని పేర్కొన్నారు. హరితహారంలో అవినీతి చోటుచేసుకుందని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు.

✦ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

మల్యాల: ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ అన్ని పార్టీల కార్యకర్తలకు అండగా నిలిచే ప్రజా నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని విమర్శించే స్థాయి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు లేదని, జీవన్‌రెడ్డిపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ జెడ్పీటీసీ మారంపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మారంపల్లి గంగాధర్, సైదల అంజయ్య, కంచర్ల లక్ష్మణాచారి, ఎనగందుల గంగయ్య, లక్ష్మణ్ ఉన్నారు.

✦ మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

జగిత్యాలరూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని నల్లగుట్ట సమీపంలోని కోళ్ల ఫామ్‌ల వద్ద జగిత్యాల-గొల్లపల్లి ప్రధాన రహదారిపై శనివారం రాత్రి మిషన్ భగీరథ గేట్ వాల్ పగిలిపోవడంతో నీరు ఉధృతంగా రోడ్డుపై ప్రవహించడంతో గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పైప్ లైన్ ద్వారా నీటిని అదుపుచేసేలా ప్రయత్నిస్తున్నారు.

✦ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

మల్లాపూర్: మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, భారతి అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని సాతారం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన వార్షికోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వారు పాల్గొన్నారు. సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మెడ కొక్కుల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు బొడ్డు రాజేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

✦ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటకు చెందిన శ్రీనివాస్‌కు రూ.18వేలు, కథలాపూర్‌కు చెందిన శశిధర్‌రెడ్డికి రూ.26వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అందజేశారు. ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్, మహేందర్, శంకర్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

✦ దళితబంధులో దళారులు

సారంగాపూర్: దళితబంధు పథకంలో మధ్య దళారులు డబ్బులు తీసుకున్నారని సాక్షాత్తు సీఎం కేసీఆర్ పేర్కొన్నదానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్లు బయపెట్టాలన్న దానిలో తప్పేముందని కాంగ్రెస్ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు అప్పం స్వామి, జిల్లా యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి ఆసాది హరీశ్ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీపై అర్థరహితమైన విమర్శలు చేయడం వారి అవివేకమన్నారు. పార్టీ ఎస్సీ విభాగం నాయకులు జీవన్, రాజు, కిష్టయ్య, నర్సయ్య ఉన్నారు.

కొండగట్టులో హెల్త్ క్యాంప్

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంపై శనివారం హైదరాబాద్ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ది శ్రీనివాస్‌తో పాటు భక్తులకు ఉచిత టెస్టులు చేశారు.

షరతులు లేకుండా ధాన్యం కొనాలి

పెగడపల్లి: రబీలో రైతులు పండించిన వరిధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో ఆలస్యం జరిగినందునే కేంద్రాలకు తరలించిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి పోయిందని వారు పేర్కొన్నారు. తడిసి రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ పెగడపల్లి ఏఈవో లావణ్యకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, నాయకులు మోహన్‌రెడ్డి, నరేందర్, కిశోర్, కుమారస్వామి, గట్టయ్య, శేఖర్, లతీశ్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

- హాజరుకాని వారికి మెమోలు జారీ చేయాలి
- మండల సభలో ఏకగ్రీవ తీర్మానం

జగిత్యాలరూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరవడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం జగిత్యాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ములాసపు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు నాలుగేళ్లుగా చెప్పినా పనులు చేయడం లేదని మోతె ఎంపీటీసీ రొండి రాజశేఖర్‌రెడ్డి, అంబారిపేట సర్పంచ్ గోస్కుల గంగాధర్ అధికారులను ప్రశ్నించారు. మోతెలో మత్తడి నిర్మించి 10 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ బిల్లులు చెల్లించడం లేదని అంబారిపేటలో తూముల వద్ద మరమ్మతు చేయాలని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకున్నా సరఫరా అయినట్లు అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నారని అంబారిపేట సర్పంచ్ గంగాధర్, మోతె ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మోతెలో ఒకే ట్యాంక్ ద్వారా నీరు ఇచ్చి రెండు ట్యాంకుల ద్వారా నీరు ఇచ్చినట్లు తప్పుడు నివేదికలు సమర్పించారని ఆరోపించారు. మూడేళ్లుగా ఎస్సీ, ఎస్టీ కాలనీకి నీరందడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు నీరు సరఫరా చేయడం లేదన్నారు. ధరూర్ శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద మిషన్ భగీరథ అవుట్‌లైన్ కట్ అయిందని, 9 నెలల నుంచి చెప్తున్నా.. మరమ్మతు చేపట్టడం లేదని సర్పంచ్ డెక్క ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి ప్రసవం కోసం వెళ్తే వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు పోతున్నాయని, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల కోసం మేము గర్భిణులను పంపబోమని అంబారిపేట సర్పంచ్ గంగాధర్ అన్నారు. ఐదునెలల క్రితం మాతాశిశు కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో తమ గ్రామానికి చెందిన బాదినేని లత మృతిచెందిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని అంబారిపేట సర్పంచ్ గంగాధర్, మోతె ఎంపీటీసీ రొండి రాజశేఖర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జెడ్పీటీసీ సంగెపు మహేశ్, సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో శైలజరాణి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మల్యాల: పల్లెల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రం నుంచి తాటిపల్లి వరకు బీటీ రోడ్డు వేసేందుకు రూ.2.48కోట్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల్లో ప్రకృతి వనాలు, హరితహారం చేపట్టి, పల్లెల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. కుల సంఘాల భవనాలు, గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. మల్యాల సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, జెడ్పీటీసీ కొండలపల్కల రాంమోహన్‌రావు, ఎంపీపీ మిట్టపల్లి విమల, మార్కెట్ కమిటీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంలింగారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కొడిమ్యాల: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు కొడిమ్యాల మండలంలోని రాంసాగర్‌లో పల్లె దవాఖాన భవనానికి, చెప్యాలలో రూ.70లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు పూటుక్కారి రాజశేఖర్‌రెడ్డి, నీలగిరి మాధవి, ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పానుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్లు మేనేని రాజనర్సింగారావు, పోలు రాజేందర్, మల్యాల ఏఎంసీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మల్లారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రజల ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడమే తెలంగాణ జనసమితి లక్ష్యమని పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి, టీజేఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎలుక కమలాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు ఏశాల గంగారెడ్డి, మెట్‌పల్లి మండల కన్వీనర్ పసునూరి శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ కంతి రమేశ్, కోరుట్ల మండల కన్వీనర్ శనిగరపు అశోక్, యువజన సమితి కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడు వన్నెల శశి, కార్యదర్శి సతీశ్, నాయకులు తేలు ముత్తన్న, రెబ్బటి మల్లయ్య, గంగారెడ్డి, గజ్జ రమేశ్, శేఖర్, శ్రీనివాస్, మోసె సంజీవ్, కంతి శేఖర్, నాచుపల్లి తిరుపతి పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మోహన్‌రెడ్డి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలి

మల్లాపూర్: బీజేపీ, బీఆర్‌ఎస్‌ల వైఖరితోనే రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతి, పాలన వైఫల్యం అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పించడంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ ప్రజల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పూండ్ర లక్ష్మారెడ్డి, నాయకులు మరిపెల్లి మల్లయ్య, కోటగిరి ఆనంద్ గౌడ్, ఇట్టెడి శ్రీధర్, నూతిపెల్లి రాజం, బండారి రమేశ్, కొత్తూరి గంగారాం, రాజశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

ప్రజలందరూ ఐకమత్యంతో జీవించాలి

మల్లాపూర్: ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో జీవించాలని డిప్యూటీ తహసీల్దార్ గంట శ్రావణి అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని ఒబులాపూర్‌లో స్థానిక ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సివిల్స్ రైట్స్ డే సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఏఎస్సై లక్ష్మయ్య, సర్పంచ్ అలిశెట్టి రవి, ఉపసర్పంచ్ ఎర్ర గంగు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్, మండల అధ్యక్షుడు కోరుట్ల ప్రశాంత్, మాదిగ సంఘం అధ్యక్షుడు బద్దెన చిన్నసాయన్న, మాల సంఘం అధ్యక్షుడు ఈరాదు సాయన్న, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు, ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్ తౌఖిర్‌అహ్మద్, సర్పంచ్ కూన సులోచన, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు పాల్గొన్నారు.